క్లుప్తంగా

22న అప్పలాయగుంటలో పుష్పయాగం

తిరుపతి(అలిపిరి): అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జూలై 22వ తేదీ పుష్పయాగం నిర్వహించనున్నారు. జూలై 21న సాయంత్రం 6.30 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఆలయంలో జూన్ 17 నుంచి 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం విదితమే. ఈ ఉత్సవాల్లో ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జూలై 22న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి స్నపన తిరుమంజనం చేపడుతారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2.40 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగం కనులపండువగా నిర్వహిస్తారు. ఇందులో పలురకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. అనంతరం తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

గర్భిణులకు అండగా..



నగరి: పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

నగరి : ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చే గర్భిణులకు మాజీమంత్రి ఆర్కేరోజా అండగా నిలుస్తున్నారు. బుధవారం నగరి–పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రులలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించారు. పలువురు గర్భిణులు వారితో వచ్చే చిన్నారులు పౌష్టికాహారం అందుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న సర్పంచ్ గుణవతి దంపతులు

కార్వేటినగరం: ముక్కవానిపల్లి పంచాయతీ వైఎస్సార్‌సీపీ సర్పంచ్ గుణవతి, లోకనాథనాయుడు దంపతుల కుమారుడు జ్ఞానప్రకాష్ రెండో వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుణవతి మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న తమ కు మారుడు జ్ఞానప్రకాష్ మృతిని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నామని తెలిపారు. అతని జ్ఞాపకార్థం ఏటా వృద్ధులకు అన్నదానం, దుస్తుల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మహేష్, ఆదిలక్ష్మి, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్, విజయకుమార్, వృద్ధులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కోవూరుపాడులో బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వరదయ్యపాళ్యం: తాళం వేసి, ఉన్న ఇంట్లో దుండగులు చొరబడి చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని కోవూరుపాడు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎస్.ప్రభావతి శ్రీ సిటిలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తుంది. విధి నిర్వహణలో భాగంగా మంగళవారం యథావిధిగా మధ్యాహ్నం షిఫ్ట్‌కు కంపెనీకి వెళ్లింది. ఇంటి వద్ద ఆమె తల్లి ఉండగా సాయంత్రం 4 గంటల సమయంలో ఆమె ఇంటికి తాళం వేసుకుని అక్కడికి సమీపంలోని మరో ఇంటి వద్దకు వెళ్లింది. ఆమె అర్ధగంట తరువాత తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం తెరిచి ఉండడాన్ని గమనించి లోనికి వెళ్లి, పరిశీలించింది. అయితే ఆమె కుమార్తె రాత్రి 11 గంటల సమయంలో కంపెనీ నుంచి ఇంటికి రాగానే బెరువా తెరిచి చూడగా అందులో ఉన్న 6 సవర్ల బంగారు నగలు 200 గ్రాములు వెండి, రూ.15 వేలు నగదు దోచుకెళ్లినట్టు గుర్తించారు. బాధిత మహిళ వెంటనే బుధవారం ఉదయం వరదయ్యపాళ్యం పోలీసులకు సమాచారం అందించింది. దీంతో ఎస్ఐ ప్రతాప్, ఏఎస్ఐ షణ్ముగం సంఘటనా స్థలానికి చేసుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణులకు రక్తపరీక్షలు

పాలసముద్రం : గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేసుకున్న తరువాతే వైద్య పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ, సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుశీల మాట్లాడుతూ తల్లులు తమ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించాలని సూచించారు. మహిళలు ఎక్కువ శాతం ఐరన్, క్యాల్షియం, విటమిన్స్ కలిగిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి వాటిని తీసుకుంటే శిశుమరణాలు తగ్గించవచ్చన్నారు. గర్భిణులు ప్రసవం అయ్యేవరకు ఆశావర్కర్లు వారికి సహాయంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకోవాలని సూచించారు. అనంతర గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాధ, గంగాగౌరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడు సార్ ?



- 2014–19 పాలనలో మాదిరి మెలిక పెడతారా ?
- నగరిలో మొత్తం నిరుద్యోగులు 10,900
- ఉద్యోగాల నోటిఫికేషన్ ఎప్పుడిస్తారో ? అని ఎదురుచూపులు
- ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు

నగరి : ఉద్యోగాలు, ఉపాధి కోసం నిరుద్యోగ యువత ఎదురు చూస్తోంది. జాబ్ క్యాలెండర్‌పై యువకులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంతవరకు.. నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తానంటూ ఎన్నికల హామీగా ప్రకటించిన సంగతి విదితమే. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 40 రోజులు అవుతున్నా నిరుద్యోగ భృతిపై నోరు మెదపకపోవడం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. నియోజకవర్గంలో భారీ సంఖ్యలో యువకులు ప్రభుత్వ కొలువులు వస్తాయని.. లేదంటే నిరుద్యోగ భృతి అందుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో డిగ్రీ అర్హతతో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్, పదో తరగతి అర్హతతో ప్రభుత్వ కొలువుల కోసం ఆశ పడేవారు సుమారు 11 వేల మంది నిరుద్యోగులు ఉన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు తమ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంతవరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో తెలిపారు. దీంతో నిరుద్యోగులు ఎంతో ఆశతో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ కొలువుల కోసం కష్టపడి ఆగిపోయిన వారంతా కూటమి ప్రభుత్వ నిరుద్యోగ భృతి హామీతో తిరిగి పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండడంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలు రాష్ట్రాల్లో నిరుద్యోగ భృతి ఇలా..!

హరియాణాలో ఇంటర్, పీజీ విద్యార్హత కలిగిన వారికి నెలకు రూ.900 నుంచి రూ.3 వేలు, పశ్చిమ బెంగాల్‌లో ఏడో తరగతి ఆపై చదివిన వారికి రూ.1500 అందిస్తున్నారు. మన రాష్ట్రంలో రూ.3 వేలు నెలకు అందించడంతో పాటు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు అందించాల్సి ఉంది. కొత్త ఉద్యోగాల సంగతి పక్కన పెడితే ఇప్పటికే వలంటీర్ల, రేషన్ వ్యాన్ డ్రైవర్ల ఉద్యోగాలు ఉంటాయా ? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

మార్గదర్శకాలపైనే అందరి చూపు..

2014 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతిని తమ హామీగా ప్రకటించింది. అయితే ఆ ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతి పొందడానికి విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి సవాలక్ష ఆంక్షలు విధించి నిరుద్యోగ భృతి ఇచ్చేవారి సంఖ్యను కుదించింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ అనర్హులని తేల్చడంతో పాటు 22 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు డిగ్రీ చదివిన వారికే భృతి వర్తిస్తుందని మెలిక పెట్టింది. డ్రైవింగ్ లైసెన్సు, 120 సీసీ ద్విచక్రవాహనం ఉన్నవారికి సైతం భృతి ఇవ్వలేదు. అది కూడా 2019 ఎన్నికలకు కొన్ని నెలల ముందు అమలు చేశారు. ఆ అనుభవం దృష్ట్యా ఈసారైనా ఉద్యోగం వచ్చే వరకు ఎలాంటి మెలికలు లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



మార్గదర్శకాలకు నోచుకోని నిరుద్యోగ భృతి

కార్వేటినగరం: సూపర్ సిక్స్ హామీలో భాగమైన నిరుద్యోగ భృతి హామీ మార్గదర్శకాలకు ఎప్పుడు నోచుకుంటుందో అని యువతీ యువకులు ఎదురు చూస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సీఎం చంద్రబాబు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, అంతవరకు నిరుద్యోగులకు భృతి కింద రూ.3000 ఇస్తామని హామీ ఇచ్చిన విషయం విదితమే. ఇంతవరకు ఆ పథకానికి సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో నిరుద్యోగుల్లో 2014లో ఇచ్చిన హామీలా నీరు గారిపోతుందనే అనుమానం వ్యక్తం అవుతోంది. గత ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి పథకాన్ని ప్రణాళిక ప్రకారం అమలు చేసింది. కానీ ఈ అధికారం హామీల అమలుపై ఇంతవరకు పట్టించుకోకపోవడంపై నిరుద్యోగులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో సుమారు 15 వేల మంది నిరుద్యోగులు ఉన్నారు. వారిలో ఇంటర్ నుంచి పీజీ అభ్యసించి ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే గతంలో కూడా సీఎం చంద్రబాబు నాయుడు నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పి తీరా 2019 ఎన్నికలకు కొన్ని నెలల ముందు షరతులు పెట్టి కొందరికే ఇచ్చారు. ఉన్నత చదువులు చదివి ఇంటి వద్దే ఉంటున్న నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి పథకానికి మార్గదర్శకాలు రూపొందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మండలాల వారీగా నిరుద్యోగుల సంఖ్య..

నగరి మున్సిపాలిటీ :	2500
నగరి మండలం :	1500
పుత్తూరు మున్సిపాలిటీ :	2000
పుత్తూరు మండలం :	1100
నింద్ర :	1200
విజయపురం :	1200
వడమాలపేట :	1400
మొత్తం :	10900

ప్రభుత్వ ఆస్పత్రికి సామగ్రి వితరణ



వైద్యులకు పరికరాలు అందిస్తున్న ఓంశక్తి ఆలయ నిర్వాహకులు

నగరి : స్థానిక ఓంశక్తి ఆలయంలో బుధవారం నిర్వహించిన ఆలయ 38వ వార్షికోత్సవం, 32వ గురుపాదోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఓంశక్తి ఆలయంలో అభిషేక అర్చనలు, 1008 పుష్పార్చనలు, పంచముఖ దీపారాధన నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు చక్రాల కుర్చీలు, పరుపు దిండ్లు, బాలింతలకు రొట్టెలు, పండ్లు, బిస్కెట్లు, చెవిటి వారికి వినికిడి పరికరాలు, దివ్యాంగులకు చేతికర్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అన్న దృక్పథంతో ఓంశక్తి ఆలయ నిర్వాహకులు ఆస్పత్రికి, దివ్యాంగులకు పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. మధ్యాహ్నం ఓంశక్తి ఆలయంలో సహపంక్తి భోజనం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక సేవాకమిటీ అధ్యక్షుడు టి.గంగాధరం, ఆర్ఎంఓ కార్తికేయన్, వైద్యులు జరీనా, వైద్యసిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో బుధవారం తొలిఏకాదశి పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఈశ్వర గుడి వీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాతసేవలో మేల్కొలిపారు. వివిధ రకాల ఆభరణాలు తొడిగి సుందరమయంగా అలంకరించారు. అనంతరం అర్చన, తోమాల సేవ, నైవేద్యం సమర్పణ, తిరువారాధన చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఏకాంతసేవ, సల్లింపు చేశారు. తొలి ఏకాదశి కావడంతో భక్తులు స్వామి దర్శనం కోసం క్యూకట్టారు. గోవింద నామస్మరణ మార్మోగించారు. అలాగే కట్టమంచిలోని వరదరాజుల స్వామి ఆలయంలో కూడా ఏకాదశి పర్వదినాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.

ఘనంగా గంగ జాతర



అమ్మవారికి పొంగళ్లు తీసుకెళ్తున్న భక్తులు, విశేష అలంకరణలో అమ్మవారు

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్ట గ్రామంలో గ్రామదేవత గంగమ్మ జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం జనం పోటెత్తారు. తొలి పూజను కనులారా తిలకించారు. అమ్మవారికి అంబలి, పిండివంటలు, నైవేద్యం సమర్పించారు. మొక్కుబడి ఉన్న భక్తులు పలు వేషధారణల్లో మొక్కులు తీర్చుకున్నారు. తొలుత డప్పు వాయిద్యాల నడుమ గంగమ్మను నడివీధిలో కొలువుదీర్చి భక్తులు కరుణించి.. కాపాడు తల్లీ కటాక్షించమ్మా అంటూ వేడుకున్నారు. అనంతరం భక్తులు అమ్మవారి ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. వంశపారంపర్యంగా అమ్మవారి ఆలయ ధర్మకర్త స్థానిక సర్పంచ్ డిల్లయ్య చేతుల మీదుగా తొలిపూజ చేసి జాతర ఘట్టాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. కార్యక్రమంలో పండయ్య, అబ్బులు, పెరుమాల్, గంగయ్య, కృష్ణయ్య తదితరులు ఉభయదారులుగా వ్యవహరించారు.

పల్లికొండేశ్వరాలయంలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు, ఊరేగుతున్న కల్యాణ వెంకన్న

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని సర్వమంగళ సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ చైర్మన్ కె.రామచంద్రారెడ్డి భక్తుల దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సతీష్‌శర్మ, గణేష్, శరవణ, పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి ఉత్సవం

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాలకడలి మథనానంతరం మహావిష్ణువు శయనించిన రోజు నుంచి తెలుగు పండుగలు ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య పేర్కొన్నారు.

ఆషాఢ మాసం శుక్లపక్ష ఏకాదశిని తొలి ఏకాదశిగా, శయన ఏకాదశిగా కొలుస్తారన్నారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకన్న పురవీధుల్లో ఊరేగారు.

మహిళలపై జరిగే అఘాయిత్యాలపై ప్రత్యేక దృష్టి

– ఎస్పీ మణికంఠ చందోలు



ఎస్పీ మణికంఠ

ఐరాల: సైబర్ కేసులతో పాటు మహిళలపై జరిగే అఘాయిత్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక నేరాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసుల పట్ల ప్రజలు విశ్వాసం, గౌరవం పెంపొందించేలావిధులు నిర్వర్తించాలన్నారు. పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని చెప్పారు. మాదకద్రవ్యాలు, సారా, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. ఎవరైనా హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు ఎస్పీకి ఎస్ఐ రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

21న శాకాంబరీ ఉత్సవం

కాణిపాకం: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి అనుబంధ మణికంఠేశ్వర స్వామి ఆలయంలో 21న శాకంబరీ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివధ రకాల కూరగాయలతో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మరగదాంబిక దుర్గాదేవికి కూరగాయలు, పండ్లతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామని వెల్లడించారు. ఉదయం 6 గంటలకు మహా మంగళ హారతి, 10 గంటలకు వ్యాస భగవానుడికి విశేష పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

శేషవాహనంపై ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి



శేషవాహనంపై దర్శనమిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారు

కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారు శేషవాహనంపై పురవీధుల్లో దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, చేపట్టి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ ద్రౌపదీ మాన సంరక్షణ ఘట్టాన్ని భక్తులకు హరికథా గానం చేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపునకు ఉభయదారులైన క్షత్రీయ కులస్తులు సారెను సమర్పించారు. అనంతరం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారిని పట్టు వస్త్ర, సుగంధ పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకంరించి శేషవాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం నగర వీధులలో ప్రత్యేక వాయిద్యాల నడుమ బాణసంచా పేల్చుతూ స్వామి, అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్, కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, కృష్ణయాదవ్, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

సూక్ష్మ పోషకాల ఆవశ్యకతపై అవగాహన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని

పాలసముద్రం: పండించిన పంటల దిగుబడులను సుస్థిర పరచడానికి సూక్ష్మ పోషకాల ఆవశ్యకతపై రైతులు అవగాహన పెంచుకోవాలని డీఆర్‌సీ–డీటీసీ వ్యవసాయ సంచాలకులు టీవీ నాగపద్మిని తెలిపారు. బుధవారం వెంగళరాజుకుప్పంలో వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ సాగు, సూక్ష్మ పోషకాల యజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మట్లాడుతూ రైతులు పంటల సాగులో నత్రజని, భాస్వరం, పొటాష్, ఎరువులే కాకుండా సూక్ష్మ పోషకాలైన జిప్సం, బోరాన్, గంధకం మొదలైన ఎరువులు ఏ సమయంలో ఎంత మోతాదు వినియోగించాలనే దానిపై పూర్తిస్థాయిలో వివరించారు. వేరుశనగ పంటకు తెగుళ్లు సోకకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేరుశనగకు ఆకుముడత, ఆకుపచ్చ, లద్దె పురుగు వంటివి ఎక్కువగా సోకుతాయన్నారు.

ఆకుముడత లక్షణాలు..

రెండు నుంచి మూడు ఆకులను పురుగు ఒక దగ్గరకు చేర్చి గూడులా మార్చుకుని ఆకుల్లో పత్రహరితాన్ని పీల్చేస్తుంది. దీంతో మొక్కల పెరుగుదలపై ప్రభావం పడుతుంది. తెగుళ్ల నివారణకు ప్రొఫెనాపాస్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి ఎకరాకు 200 లీటర్ల వరకు పిచికారీ చేయాలి. లద్దె పురుగు పగటి వేళ భూమిలో దాక్కుని రాత్రివేళ బయటకు వచ్చి మొక్కలపై చేరి ఆకులను కొరికితింటుంది. మొక్క కొమ్మలను మాత్రమే మిగులుస్తుంది. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి గీత, రైతులు పాల్గొన్నారు.

అంతర పంటలతో ఆదాయం



మామిడిలో అంతర పంటగా సాగు చేసిన వేరుశనగ

విజయపురం : మండలంలోని రైతులు అంతర పంటలపై అధిక ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా మామిడి, టెంకాయ తోటల్లో వివిధ పంటలు సాగు చేసి అధికలాభం పొందుతున్నారు. పాతర్కాడు, జంబాడలోని రైతులు మామిడితో వేరుశనగ, టెంకాయతోటలో నువ్వులు సాగు చేస్తున్నారు. అంతర పంటల ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని రైతులు అంటున్నారు. అలాగే భూసారం పెరిగి మామిడి చెట్లు త్వరగా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అంతర పంటలకు వాడే ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడడం వల్ల మామిడి, టెంకాయ తోటలకు హాని ఉండదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంటలకు రోగాలు సోకకుండా ఉంటాయన్నారు. ఇప్పటికే మహారాజపురం, నార్పరాజుకండ్రిగ, శ్రీహరిపురంలో అంతర పంటలుగా ఆకుకూరలు, సొరకాయల పంట సాగు చేశారు.



టెంకాయతోటలో నువ్వుల పంట సాగు

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు



అగ్నిగుండం వద్ద వర పడుతున్న మహిళలు

గంగాధర నెల్లూరు: త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం పండుగను మండల వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని అబ్బాస్ నగర్ కాలనీ, ఆవులకొండ గ్రామాల్లో ముస్లింలు బుధవారం పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించి రక్తతర్పణం చేశారు. ముస్లిం యువకులు నల్లదుస్తులు ధరించి చాకులు, బ్లేడ్లతో రక్తం తర్పణం చేస్తూ పూర్వీకుల త్యాగాలకు ప్రతీకగా మొహర్రం జరుపుకుంటున్నట్లు వారు తెలిపారు.

నింద్రలో..

నింద : మండలంలోని అగరంపేట పీర్లచావడి వద్ద బుధవారం మొహర్రం పండుగను వైభవంగా జరుపుకున్నారు. గ్రామస్తులు పీర్లచావడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆచారం ప్రకారం వేకువ జామున అగ్నిగుండ ప్రవేశం చేశారు. మహిళలు పీర్ల ఎదుట వరపడ్డారు. అనంతరం పీర్లను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బొరుగులు, బెల్లం పంచిపెట్టారు.



జీడీనెల్లూరు అబ్బాస్ నగర్ కాలనీలో అలంకరించిన పీర్లు